క్లుప్తంగా

ఎమ్మెల్యే చెవిరెడ్డిని కలిసిన ఎంఈవోలు



ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎంఈఓలు

తిరుపతి రూరల్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల విద్యాశాఖ అధికారి–2 స్థానంలో కొత్తగా బాధ్యత తీసుకున్న ఎంఈవోలు ఆదివారం ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని తుమ్మలగుంటలో మర్యాదపూర్వకంగా కలిశారు. చంద్రగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఎంఈవో –2గా నియమితులైన శంకరయ్య(తిరుపతి రూరల్), లింగయ్య (పాకాల), భాస్కర్ బాబు (చంద్రగిరి), సతీష్ (వైవీ పాళెం) గోపి (చిన్నగొట్టిగల్లు), జయవేలు (ఆర్సీ పురం) ఎమ్మెల్యే చెవిరెడ్డిని కలిసిన వారిలో వున్నారు.

వారపు సంతలో అన్నదానం



చంద్రగిరి(తిరుపతి రూరల్): అన్నదాతలకు చెవిరెడ్డి కుటుంబం ఎల్లప్పుడు వెన్నుదన్నుగా నిలుస్తోందని వైఎస్సార్ సీపీ చంద్రగిరి డివిజన్ అధ్యక్షుడు కుప్పిరెడ్డి భాస్కర్‌రెడ్డి కొనియాడారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సహకారంతో వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో చంద్రగిరి వారపు సంతలో ఆదివారం రైతులు, వ్యాపారులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు అన్నదానం చేశారు. చంద్రగిరి టౌన్ అధ్యక్షుడు పార్లపల్లి చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీటీసీ మాధవరెడ్డి, రెడ్డివారిపల్లి సర్పంచ్ ప్రకాష్‌రెడ్డి, మూలస్థానమ్మ గుడి సభ్యులు వేమారెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ చంద్రారెడ్డి పాల్గొన్నారు.

గాయకుడు రామకృష్ణకు నివాళి



మాట్లాడుతున్న రిటైర్డ్ జడ్జి పి.గుర్రప్ప

తిరుపతి కల్చరల్: గాయకుడు పూతలపట్టు రామకృష్ణ సేవలు మరువలేనివని రిటైర్డ్ జడ్జి పి.గుర్రప్ప కొనియాడారు. యూత్ హాస్టల్లో ఆదివారం ప్రముఖ కొరియోగ్రాఫర్ భానుకుమార్ అధ్యక్షతన గాయకుడు, అంబేడ్కర్ బుర్రకథ ప్రధాన కథకుడు పూతలపట్టు రామకృష్ణ సంస్మరణ సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రిటైర్డ్ జడ్జి పి.గుర్రప్ప మాట్లాడుతూ కుల, వర్గ అసమానతలపై తన కలము, పాటలతో పోరాటం చేసిన వ్యక్తి రామకృష్ణ అని తెలిపారు. ఆర్‌పీఐ దక్షిణ భారత అధ్యక్షుడు పి.అంజయ్య మాట్లాడుతూ కళ సమాజం కోసం అని పేర్కొంటూ గ్రామం నుంచి దేశస్థాయి వరకు అనేక ప్రదర్శనలు ఇచ్చిన వ్యక్తి రామకృష్ణ అని కొనియాడారు. కార్యక్రమంలో ప్రగతి సంస్థ అధ్యక్షుడు కేవీ.రమణ, న్యాయవాది సుబ్రమణ్యం, మోడల్ స్కూల్ అధ్యాపకుడు హరి, డీఎంఎస్ స్టూడియో అధినేత విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో బాలల హక్కుల కమిషన్ చైర్మన్

తిరుమల: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆయన మాట్లాడుతూ తిరుమలలో కొంత మంది బాలలు భిక్షాటన చేయడంతో పాటు బొమ్మలు విక్రయిస్తూ కనిపించారని చెప్పారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. బడి బయట పిల్లలను పాఠశాలలో చేర్పించే దిశగా విద్యాశాఖ అధికారులు అడుగులు వేయాలన్నారు.

సీగొల్లపల్లిలో వైభవంగా మాతమ్మ ఉత్సవాలు

- సారె సమర్పించిన చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి



సారె సమర్పిస్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, పక్కన వైస్ ఎంపీపీ మాధవరెడ్డి

తిరుపతి రూరల్: మండలంలోని సీగొల్లపల్లిలో మాతమ్మ ఉత్సవాలు అంగరంగవైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తరుపున ఆయన కుమారుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి అమ్మవారికి సారె సమర్పించారు. ఆయనకు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, తిరుపతి రూరల్ వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి సాదర స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ విడుదల రవి, నాగరాజు, గోపాల్ రెడ్డి, హరి, సురేష్, అయ్యప్ప, ఈశ్వరయ్య, సుబ్రమణ్యం, గోపి పాల్గొన్నారు.

సచివాలయాలు..

గ్రామ స్వరాజ్య దీపికలు

- వేగవంతంగా గడప గడపకూ ప్రభుత్వ సేవలు
- జగన్ విజన్‌కు పల్లె ప్రజల ఫిదా



రంగంపేట సచివాలయంలో సర్టిఫికెట్లు, మంజూరు పత్రాలను అందిస్తున్న సచివాలయ సిబ్బంది (ఫైల్)

ప్రజల ముంగిటికే ప్రభుత్వ సేవలు అందించాలన్న సంకల్పంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఏర్పాటుచేసిన సచివాలయ వ్యవస్థ సత్ఫలితాలనిస్తుంది. వీటితో గాంధీజీ కలలుగన్న స్వరాజ్యం సాకారమైంది. ప్రజలు సులభంగా సేవలు అందుకుంటున్నారు. సచివాలయాలకు అనుబంధంగా 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను నియమించడంతో పథకాలు ఇంటి ముంగిటికే చేరుతున్నాయి. అవినీతి రహిత, పారదర్శక పరిపాలన సాగుతోంది. గతంలోలా పనుల కోసం కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరిగే బాధ తప్పిందని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. **–తిరుపతి రూరల్**

మండలం పేరు	చంద్రగిరి
సచివాలయాలు	20
పంచాయతీలు	21
మండల జనాభా	57,286
ఇళ్ల సంఖ్య	14,904
సచివాలయ సిబ్బంది	156
గ్రామ, వార్డు వలంటీర్లు	351
సచివాలయాల్లో అందుతున్న సేవలు	540



మిట్టపాలెం సచివాలయం

చంద్రగిరి మండలంలో 21 పంచాయతీలు ఉన్నాయి. 57,286 మంది జనాభా ఉండగా 14,904 ఇళ్లు ఉన్నాయి. వీరికి స్థానికంగానే సేవలు అందించేందుకు 20 గ్రామ సచివాలయాలను ఏర్పాటుచేశారు. వీటిలో 156 మంది సిబ్బంది పని చేస్తున్నారు. వీరికి అనుబంధంగా 351 మంది వలంటీర్లు సేవలు అందిస్తున్నారు. సచివాలయాల్లో సుమారు 540 ప్రభుత్వ సేవలు అందిస్తున్నారు. సిబ్బంది ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లి అర్హతను తెలుసుకుని ఎవరి సిఫార్సు లేకుండానే పథకాలు అందిస్తున్నారు. అలాగే కులం, ఆదాయం, నివాస, బర్త్, డెత్ తదితర ధ్రువీకరణ పత్రాలను వలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే తెచ్చి ఇస్తున్నారు. ప్రతి నెలా ఒకటో తేదీనే సామాజిక పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. విద్యార్థులకు జగనన్న వసతి, విద్యా దీవెన అందేలా చర్యలు తీసుకుంటున్నారు.

సేవలు బాగున్నాయి



సచివాలయ సేవలు చాలా బాగున్నాయి. గ్రామంలో ఉన్నందు వల్ల సులువుగా సచివాలయానికి వెళ్లగలుగుతున్నాం. స్త్రీనిధి, వైఎస్సార్ చేయూత, సున్నా వడ్డీ, ఆసరా తదితర పథకాలకు లబ్ధిదారులను ఇంటికే వచ్చి ఎంపిక చేస్తున్నారు. ఒకటో తేదీ ఉదయమే వలంటీర్లు పెన్షన్ అందజేస్తున్నారు. గతంలో సర్టిఫికెట్ల కోసం మండల కేంద్రం చుట్టూ తిరిగే వాళ్లం. ప్రస్తుతం సచివాలయంలోనే ఇస్తున్నారు.

–కవిత, ఇందిరమ్మ కాలనీ, చంద్రగిరి మండలం

చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నాం



గతంలో సర్టిఫికెట్లు, ప్రభుత్వ పథకాల కోసం దళారులు, జన్మభూమి కమిటీ సభ్యులను ఆశ్రయించాల్సి వచ్చేది. సకాలంలో సేవలు అందక ఇబ్బందులు ఎదుర్కొన్నాం. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చాక ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థతో ఇబ్బందులు తొలగిపోయాయి. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇళ్ల వద్దకే వచ్చి సేవలు అందిస్తున్నారు. ఎలాంటి అవినీతి లేకుండా పరిపాలన సాగుతోంది.

–కుమార్, తొండవాడ, చంద్రగిరి మండలం

సచివాలయంలోనే భూ రికార్డులు



మా గ్రామానికి మండల కేంద్రం దాదాపు 15 కిలోమీటర్లు ఉంది. గతంలో రెవెన్యూ సమస్యల కోసం మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. ఆ రోజు పని అవుతుందని గ్యారెంటీ లేదు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఏ సమస్య అయినా సచివాలయంలోనే పరిష్కరిస్తున్నారు. వలంటీర్లు ఏమి కావాలన్నా ఇంటి దగ్గరికి వచ్చి పనులు చేస్తున్నారు. పనులు మానుకుని ఆఫీసుల చుట్టూ తిరగాల్సిన బాధలు తప్పాయి.

–మురళి, దోర్నకంబాల, చంద్రగిరి మండలం

ఉత్సవాలకు చెవిరెడ్డి దంపతులకు ఆహ్వానం



తిరుపతి రూరల్: మండలంలోని ముండ్లపూడిలో జరుగుతున్న మహాభారత ఉత్సవాలకు రావాలని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులను గ్రామ పెద్దలు ఆహ్వానించారు. వారు ఆదివారం తుమ్మలగుంటలోని చెవిరెడ్డి నివాసంలో కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ నెల 21 నుంచి ప్రారంభమైన మహా భారత ఉత్సవాలు 18 రోజుల పాటు నిర్విఘ్నంగా జరుగుతాయని సర్పంచ్ సూరి తెలిపారు.

మంచి అలవాట్లతో ఆరోగ్యం పదిలం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు వెంకటరమణ, నిరుపమ

తిరుపతి తుడా: మంచి అలవాట్లతోనే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని వెంకటరమణ హార్ట్ అండ్ మెటర్నిటీ హాస్పిటల్ అధినేత, ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ వెంకటరమణ అన్నారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఆదివారం జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యుల కోసం కార్డియాక్ మెటర్నిటీ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈసీజీ, ఎకో తదితర పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. డాక్టర్లు వెంకటరమణ, నిరుపమ మాట్లాడుతూ ఒత్తిడి, ఆహారపు అలవాట్ల వల్ల గుండె సంబంధిత సమస్యలు వస్తున్నాయని తెలిపారు. జర్నలిస్టులు ఒత్తిడిని అధిగమించేందుకు యోగ ధ్యానంపై దృష్టి సారించాలన్నారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం కోసం పనిచేస్తున్నామన్నారు. ప్రెస్ క్లబ్ సెక్రటరీ బాలచంద్ర మాట్లాడుతూ జర్నలిస్టుల ఆరోగ్య సంరక్షణలో భాగంగా కమిటీ ఆధ్వర్యంలో ప్రతి మూడు నెలలకు ఒకసారి మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కమిటీ జాయింట్ సెక్రటరీ లావణ్య కుమార్, ఈసీ మెంబర్లు గల్లా మహేష్, సంజీవ సునీల్, పరంధామరెడ్డి, కుమార్, ప్రెస్ క్లబ్ మాజీ కోశాధికారి శివశంకరయ్య, పులిగోరు శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ పథకాలు అందాలి



మాట్లాడుతున్న నారాయణరెడ్డి, గుండ్రాజు శివశంకర్‌రాజు

తిరుపతి మంగళం : ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను అందించే బాధ్యత వలంటీర్లతోపాటు గృహసారథులదేనని వైఎస్సార్ సీపీ మంగళం పంచాయతీల డివిజన్ అధ్యక్షుడు నారాయణరెడ్డి, తిరుమలనగర్ పంచాయతీ అధ్యక్షుడు, కన్వీనర్ గుండ్రాజు శివశంకర్‌రాజు తెలిపారు. మంగళంలోని తిరుమలనగర్ సచివాలయ ఆవరణలో ఆదివారం కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి, తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆదేశాల మేరకు జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రతి గడపకూ వెళ్లి వారికి జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా? అని తెలుసుకోవాలన్నారు. సమస్యలు ఉంటే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో బీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గుండ్రాజు లక్ష్మీదేవి, ఉపసర్పంచ్ ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన వీసీ



తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తిని ఆదివారం పద్మావతి మహిళా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ భారతి మర్యాదపూర్వకంగా కలిశారు. మహిళా వర్సిటీ అభివృద్ధికి సహకారం అందిస్తానని వీసీకి ఎంపీ హామీ ఇచ్చారు. వీసీగా బాధ్యతలు చేపట్టినందుకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈస్ట్ సీఐగా మహేశ్వర్ రెడ్డి బాధ్యతల స్వీకరణ



తిరుపతి క్రైం: తిరుపతి ఈస్ట్ సీఐగా మహేశ్వర్ రెడ్డి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన కర్నూలు జిల్లాలోని ఆదోని రూరల్ సీఐగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి సేవలు అందిస్తానని తెలిపారు.

ఆన్‌లైన్ డెలివరీ యాప్ మీట్ 7 ప్రారంభం



తిరుపతి కల్చరల్: తాజా మాంసం ఆన్‌లైన్ డెలివరీ యాప్ మీట్ 7ను ఆదివారం తిరుపతిలో ఘనంగా ప్రారంభించారు. మీట్ 7 డైరెక్టర్ విజయ్‌కుమార్ చౌదరి, ది కో వర్క్ స్పేసెస్ ఇండియా డైరెక్టర్లు నరేంద్ర కవాతి, రాజేంద్ర ప్రసాద్, రమీరాయ్‌రెడ్డి టీమ్ సాయికిరణ్, మోహన్, కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో ఈ మీట్ 7 యాప్‌ను ఆరంభించారు. ఈ సందర్భంగా మీట్ 7 డైరెక్టర్ విజయకుమార్ చౌదరి మాట్లాడుతూ తాము తాజా, నాణ్యమైన మాంసాన్ని అందజేస్తామని స్పష్టం చేశారు. తిరుపతి అంతటా తమ మీట్ 7 యాప్ ద్వారా చికెన్, మటన్, చేపలు, మాంసం, ఊరగాయలు అందిస్తామని తెలిపారు. మీట్ 7 యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, యాప్ స్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.

తిరుపతి లయన్స్ క్లబ్‌కు ఉత్తమ అవార్డు



అవార్డు అందుకుంటున్న మునిక్రిష్ణ నాయుడు

తిరుపతి కల్చరల్: వివిధ విభాగాల్లో విస్తృత సేవలు నిర్వహించిన తిరుపతి లయన్స్ క్లబ్‌కు ఉత్తమ అవార్డు లభించింది. బెంగళూరులోని ఈస్ట్ కల్చరల్ అసోసియేషన్‌లో శనివారం లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 317ఇ గవర్నర్ వినుతా ప్రకాష్ ఆధ్వర్యంలో అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా న్యూ ఎక్స్‌టెన్షన్ క్లబ్ విభాగంలో తిరుపతి లయన్స్ క్లబ్ ప్రథమ స్థానాన్ని దక్కించుకుంది. డిస్ట్రిక్ట్ గవర్నర్ స్పెషల్ అప్రిసియేషన్ అవార్డును గవర్నర్ వినుతా ప్రకాష్ చేతుల మీదుగా తిరుపతి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మునికృష్ణ నాయుడు అందుకున్నారు. క్లబ్ కార్యదర్శి చిత్రమోహన్, కోశాధికారి ముబారక్‌బాషా, సభ్యుల సహకారంతో ఈ అవార్డు సాధించామన్నారు.



అవార్డు అందుకుంటున్న విజయబాబు

ఉత్తమ కార్యదర్శిగావిజయబాబు

పాకాల: పాకాల ప్లాటినం లయన్స్‌క్లబ్ కార్యదర్శి మారసాని విజయబాబు 2022–23వ సంవత్సరానికి ఉత్తమ కార్యదర్శిగా ఎంపికయ్యారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ బెంగళూరు డిస్ట్రిక్ట్ 317 ఇ గవర్నర్ వినుతా ప్రకాష్ సమక్షంలో ఫాస్ట్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ కృష్ణారెడ్డి చేతుల మీదుగా శనివారం అవార్డును అందుకున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఆర్సీ కెఎస్.మస్తాన్, డీసీ రామయ్యకు డీజీ ప్రశంసా పత్రాలు అందజేసినట్టు పేర్కొన్నారు. భవిష్యత్తులో ప్రజలకు మరిన్ని సేవలు అందిస్తామని తెలిపారు. పాకాల ప్రాంతంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వివరించారు.

ప్రతిపక్షాల విమర్శలపై ప్రజల ఆగ్రహం



జగనన్న అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

- జగనన్న సంక్షేమ పథకాలు పొందని గడపంటూ లేదు
- పేదల పక్షపాతి ముఖ్యమంత్రి జగన్
- వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ పార్టీలు కనుమరుగు
- గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం: ప్రజాసంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి రెండు కళ్లుగా భావించి పరిపాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిపై టీడీపీ, జనసేన తదితర ప్రతిపక్షాల విమర్శలపై ప్రజలు మండిపడుతున్నారని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం కార్పొరేటర్ వి.ఈశ్వరి, డివిజన్ అధ్యక్షుడు పడమటి కుమార్ ఆధ్వర్యంలో తిరుపతి 21వ డివిజన్ సీతమ్మనగర్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా? సమస్యలు ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. నాలుగన్నరేళ్ల ప్రభుత్వం నుంచి వారు పొందిన లబ్ధిని వివరించారు. ఆయన మాట్లాడుతూ దేశ రాజకీయ చరిత్రలోనే ఏ నాయకుడూ అందించలేనన్ని సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేసి ప్రజల గుండెల్లో స్థిరంగా నిలిచిపోయారన్నారు. ఆయనకు ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూసి చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ లేనిపోని విమర్శలు చేస్తూ బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలు పొందని గడప అంటూ లేదని స్పష్టం చేశారు. 14 ఏళ్లలో చంద్రబాబుకు చేతకాని, అందించలేనన్ని సంక్షేమ పథకాలు జగనన్న అందించి ప్రజల్లో దేవుడైపోతున్నారన్న అక్కసుతో విమర్శలు గుప్పిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రజలంతా జగనన్నే మాకు మళ్లీ సీఎంగా ఉండాలని కోరుకుంటున్నారన్నారు. పేదల పక్షపాతిగా వారి సంక్షేమమే లక్ష్యంగా వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని వివరించారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌తో ఎన్ని పార్టీలు జతకట్టినా వైఎస్సార్ సీపీ విజయకేతనం ఎగురవేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల తర్వాత టీడీపీ, జనసేన పార్టీలు కనుమరుగవుతాయని చెప్పారు. కార్యక్రమంలో టౌన్ బ్యాంకు డైరెక్టర్లు మబ్బు నాదమునిరెడ్డి, మాకం చంద్రయ్య, వేమూరి జ్యోతిప్రకాష్, కడపగుంట అమరనాథ్ రెడ్డి, నాయకులు పాముల రమేష్‌రెడ్డి, తిమ్మారెడ్డి, తాలూరి ప్రసాద్, అనీల్, నాగరాజు, మనోహర్‌రెడ్డి, డిష్ చంద్ర, జీవన్, వెంకటేష్, నాదముని, ధనశేఖర్, కంకనాల రమేష్ పాల్గొన్నారు.

హనుమంత వాహనంపై కల్యాణ వెంకన్న అభయం



చంద్రగిరి(తిరుపతి రూరల్): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న సాలకట్ల సాక్షాత్కార వైభవోత్సవాల్లో రెండో రోజు ఆదివారం రాత్రి స్వామివారు హనుమంత వాహనంపై భక్తులకు అభయమిచ్చారు. ఉదయం సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి, తోమాలసేవ, కొలువు, పంచాంగ శ్రవణం, సహస్రనామార్చన నిర్వహించారు. అనంతరం కల్యాణ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామివారి ఉత్సవర్లకు వేడుకగా స్నపన తిరుమంజనం చేశారు. సాయంత్రం ఊంజల్‌సేవ చేపట్టారు. రాత్రి స్వామి వారు హనుమంత వాహనంపై కొలువుదీరి ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గురుమూర్తి, సూపరింటెండెంట్ ముని చెంగల్రాయులు పాల్గొన్నారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి

– హౌసింగ్ పీడీ వెంకటేశ్వరరావు



తొండవాడ జగనన్న కాలనీలో ర్యాలీ చేస్తున్న హౌసింగ్, పంచాయతీరాజ్ అధికారులు

చంద్రగిరి(తిరుపతి రూరల్): జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. చంద్రగిరి మండలం తొండవాడ సమీపంలోని జగనన్న కాలనీలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రధాన మంత్రి ఆవాస యోజన పథకం 8 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జగనన్న కాలనీలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ తిరుపతి రూరల్, చంద్రగిరి మండలాల్లోని పేదలకు ఐదు వేల ఇళ్లు మంజురైనట్టు పేర్కొన్నారు. ఇప్పటి వరకు 4 వేల ఇళ్ల నిర్మాణం జరుగుతున్నాయని, ఆగస్టులోపు పనులు పూర్తి చేసి ప్రవేశాలకు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో డీఈ చంద్రశేఖర్ బాబు, ఎంపీడీవోలు వెంకటనారాయణ, రమేష్‌బాబు, తహసీల్దార్ శిరీష, ఏఈలు శ్రీరాములురెడ్డి, రామిరెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్యమే నిజమైన సంపద



మాట్లాడుతున్న కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి

తిరుపతి కల్చరల్: ఆరోగ్యమే నిజమైన ధనమని, ఎంత సంపద ఉన్నా ఆరోగ్యంగా లేకపోతే వృథా అని జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి తెలిపారు. డాక్టర్ డే సందర్భంగా ఆదివారం ప్రజాశక్తి, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సంయుక్తంగా మంగళంలోని రణధీర్‌పురం పంచాయతీలోని అన్నమయ్య కళాక్షేత్రంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం కోసం రూ.వేల కోట్లు వెచ్చిస్తోందన్నారు. గ్రామీణ ప్రజల ఆరోగ్యం కోసం ఉచిత వైద్య శిబిరాలను ప్రయోగాత్మకంగా నిర్వహిస్తున్నామని, ఇవి విజయవంతమైతే రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని వివరించారు. టీటీడీ దాతల ద్వారా ఇప్పుడున్న పింక్ బస్సులకు మరో రెండు బస్సులను అందించనున్నారని తెలిపారు. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ పేదలకు సేవ చేయడం, వారి ప్రాణాలు కాడాలన్నదే వైద్యుల ధ్యేయమని తెలిపారు. అనంతరం ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐఎంఏ జాతీయ ఉపాధ్యక్షుడు దగ్గుమాటి శ్రీహరిరావు, ప్రజాశక్తి జిల్లా బాధ్యుడు కందారపు మురళి, ప్రసూతి ఆసుపత్రి పర్యవేక్షణాధికారి పార్థసారథిరెడ్డి, ఐఎంఏ నేత యుగంధర్, సీపీఎం జిల్లా నేత గంగరాజు, సీఎస్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ కమిషనర్

తిరుపతి తుడా: ప్రజల సమస్యల పరిష్కారం కోసం సోమవారం డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత తెలిపారు. ప్రజలు ఉదయం 9:30 నుంచి 10:30 గంటల వరకు 0877–2227208కి కాల్ చేసి సమస్యలను తెలపవచ్చని, అలాగే ఉదయం 10:30 నుంచి నేరుగా ఫిర్యాదులు అందజేయవచ్చన్నారు.

చిత్రకారులకు బీమా భరోసా



చిత్రకారులకు బీమా బాండ్లు అందజేస్తున్న వెంకటస్వామి

తిరుపతి రూరల్: తిరుపతిలోని 35 మంది పెయింటింగ్ ఆర్టిస్టులకు తిరుపతి పెయింటింగ్ ఆర్టిస్ట్స్, వర్కర్స్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లంపల్లి వెంకటస్వామి బీమా సౌకర్యం కల్పించారు. తిరుపతిలోని యూత్ హాస్టల్లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారికి బీమా బాండ్లు అందజేశారు. వెంకటస్వామి మాట్లాడుతూ చిత్రకారులు పనులు చేసే సమయంలో ప్రమాదానికి గురైతే వారి కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బంది పడకూడదన్న సదుద్దేశంతో 35 మందికి ఇన్సూరెన్స్ చేయించినట్లు తెలిపారు. సమావేశంలో సంఘం గౌరవ అధ్యక్షుడు గోపీనాథ్, జాయింట్ సెక్రటరీ రాజశేఖర్, గౌరవ సలహాదారు రాజ, ఎగ్జిక్యూటివ్ సభ్యులు పూర్ణచంద్రరావు, చంద్రబాబు, భాస్కర్, దివాకర్ పాల్గొన్నారు.